సాక్షి మహబూబాబాద్

శనివారం | 3 | మే 2025



దేవాదుల.. పరిష్కారమెలా..?

రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం దేవాదుల ప్రాజెక్టుపై కీలక సమీక్ష నిర్వహించేందుకు వరంగల్ వస్తున్నారు. - 10లో▸



ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల మూల్యాంకనం

తెలంగాణ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 5నుంచి హనుమకొండలోని తోటబడిలో నిర్వహించనున్నారు. - 10లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అవగాహన సదస్సులు నిర్వహించాలి

మహబూబాబాద్ రూరల్: ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుంచి జూన్ 13వ తేదీ వరకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పేరిట అవగాహన సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త మాలతి శుక్రవారం తెలిపారు. దీనిలో భాగంగా మల్యాల కేవీకే శాస్త్రవేత్తలు, అధికారులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, అభ్యుదయ రైతులు ఒక బృందంగా ఏర్పడి వారంలో మూడు సమావేశాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మొత్తం 18 సమావేశాలు జరగనున్న నేపథ్యంలో అవగాహన సదస్సుల ద్వారా రైతులు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు సలహాలతో పాటు సూచనలు ఇవ్వనున్నారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ఇవ్వాలి



మహబూబాబాద్ రూరల్ : దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో ఈ నెల 20న మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఏఎంసీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, కార్యదర్శి షంషీర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు రేషపల్లి నవీన్, కుమ్మరికుంట్ల నాగన్న, పర్వత కోటేశ్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కులు కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే విధంగా సమ్మె జరుగుతుందని పేర్కొన్నారు. కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చెక్కల సోమయ్య, బాలు, లచ్చు, సురేశ్, ఉపేందర్, ముత్యాలు, విజయ్, నవీన్, మహేందర్, హరి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ ఉన్న పంటలు సాగుచేయాలి



మహబూబాబాద్ రూరల్: మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగును ప్రోత్సహించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి కార్యాలయంలో క్షేత్రస్థాయి అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మరియన్న మాట్లాడుతూ.. జిల్లాలో ఆయిల్ పామ్, పండ్ల తోటలు, కూరగాయలు, పూలు, మల్బరీ తదితర మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. సమావేశం అనంతరం పలు ఆయిల్ పామ్, మిరప, పండ్లు, కూరగాయలు తదితర కరపత్రాలను క్షేత్రస్థాయి అధికారులకు అందజేశారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి



తొర్రూరు: సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలని ఇంటర్ విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకుడు యాదగిరి అధ్యాపకులకు సూచించారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు కొనసాగుతున్న ప్రత్యేక తరగతులను డీఈఓ మదార్ గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశీలకుడు యాదగిరి అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు. ఒకటి నుంచి మూడు సబ్జెక్టులు ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు. పేద విద్యార్థులను వృద్ధిలోకి తీసుకొచ్చే బాధ్యత మనదేనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు న్యాయమైన విద్య అందించేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, అధ్యాపకులు సువర్ణ, ఉప్పలయ్య, అన్నపూర్ణ, నర్సయ్య, మల్లయ్య, శివరామ కృష్ణ, అనిత, రాజేశ్, నాగరాజు, కమల్ దీప్, అలీ, విద్యార్థులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

కురవిలో తడిసిన ధాన్యం బస్తాలు



ఎగిరిపోయిన ఇంటి పైకప్పు రేకులు..

కురవి: మండలంలో పలు గ్రామాల్లో గాలివానతో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. మామిడికాయలు నేలరాలాయి. భారీ వృక్షాలు ఖమ్మం రహదారిపై పడగా.. సీరోలు ఎస్సై నగేష్ ఆధ్వర్యంలో పోలీసులు జేసీబీలతో తొలగించడంతో ఉదయం 9గంటలకు రాకపోకలు యథావిధిగా నడిచాయి. బంగారుగూడెంలో మాలోత్ తావుర్య, లక్ష్మి దంపతుల ఇంటిపై కప్పు రేకులు గాలికి ఎగిరిపోయాయి. నల్లెల్లలో ఎస్‌కే ఖాజా అనే దివ్యాంగుడి ఇంటి పైకప్పుకు అమర్చిన పెంకులు పగిలిపోయాయి. రాజోలు శివారు బాలు తండాలో మాలోత్ వసంతరావుకు చెందిన ఎర్రచందనం, శ్రీగంధం చెట్లు నేలకూలాయి. హరిదాసు తండాలో 10 విద్యుత్ స్తంభాలు నేలకూలిపోవడంతో అంధకారం అలుముకుంది. మాలోత్ శ్రీధర్, జరుపుల హన్నీ, బానోత్ నరేష్‌కు చెందిన ఇంటి పైకప్పులు గాలికి ఎగిరిపోయాయి.

విరిగిన చెట్లు, కూలిన గోడలు..



కేసముద్రం: చైతన్యనగర్‌లో ఈదురుగాలులకు లేచిపడిన ఇంటి పైకప్పు

కేసముద్రం/తొర్రూరు రూరల్: కేసముద్రం మండలంలోని పలు గ్రామాల్లో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఇంటిపై రేకుల కప్పులు లేచిపడగా, గోడలు కూలాయి, పలు చోట్ల చెట్లు విరిగి నేలమట్టమయ్యాయి. మండలంలోని భవానిగడ్డతండా జీపీలో జల్లె శ్రీనివాస్, పుట్ట సరోజన, అనిత, పోలెపాక కాంతభవాని, మున్సిపాలిటీ పరిధిలోని చైతన్యనగర్ కాలనీకి చెందిన నర్స ప్రవీణ్ ఇళ్ల పైకప్పులు, గోడలు కూలాయి. అదే విధంగా కేసముద్రం నుంచి మానుకోటకు వెళ్లే దారిలో, కోరుకొండపల్లికి వెళ్లే దారిలో చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. అలాగే తొర్రూరు మండలంలో కరెంట్ స్తంభాలు కూలిపోయాయి. మామిడికాయలు రాలిపోయాయి.



గూడూరులో వర్షానికి తడిసిన ధాన్యం

- నేలరాలిన మామిడి కాయలు
- గాలికి ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పు రేకులు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- రోడ్లపై చెట్లు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం

సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. బొప్పాయి తోటలు నేలకూలాయి. మామిడికాయలు రాలిపోయి రైతులకు తీవ్ర నష్టం కలిగింది. అలాగే రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు కూలడంతో వాహనాల రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

అపార నష్టం..



బస్తాలపై ఉన్న నీటిని ఎత్తిపోస్తున్న యువకుడు

మరిపెడ రూరల్: అకాల వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. అలాగే విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

గోడ కూలి విరిగిన వృద్ధురాలి కాలు ..

గూడూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. అదే విధంగా మండలంలోని జగన్నాయకులగూడెంలో వీధుల్లో రెండో చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలగా, చెట్లు విరిగిపడ్డాయి. ఇంటి పై కప్పు రేకులు ఎగిరిపోయాయి. కొల్లాపురం గ్రామంలో పెంకుటిల్లు గోడ కూలడంతో ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలు గుండెల వెంకటమ్మ కాలు విరిగింది. ఆమెను చికిత్స నిమిత్తం వరంగల్ ఆస్పత్రికి తరలించారు.

కొల్లాపురంలో ఇంటి గోడ కూలగా, కాలు విరిగి చికిత్స పొందుతున్న వృద్ధురాలు →



నేలకూలిన మర్రి వృక్షం



నేలకూలిన 150ఏళ్ల మర్రిచెట్టు..

బయ్యారం: మండలంలోని బయ్యారం, గంధంపల్లి, కొత్తపేట, వెంకట్రాంపురం, ఉప్పలపాడు, బాలాజీపేట తదితర గ్రామాల్లో గాలితో కూడిన భారీ వర్షం కురిసింది. గాలి కారణంగా మండల కేంద్రంలోని రంగాపురం గ్రామ దేవత ఆలయం వద్ద ఉన్న 150 ఏళ్ల మర్రివృక్షం నేలకూలింది. ఇదే విధంగా మహబూబాబాద్-ఇల్లెందు రహదారిపై పలు చోట్ల వృక్షాలు నేలకూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు పెద్ద సంఖ్యలో కిందపడిపోయాయి. మామిడి కాయలు రాలిపోగా, ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్నలు తడిసిపోయాయి.



బయ్యారం: కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన ధాన్యం వద్ద నిలిచిన వర్షపు నీరు

బొప్పాయి తోట ధ్వంసం..

దోర్నకల్/ నెహ్రూసెంటర్: గాలివాన బీభత్సంతో డోర్నకల్ మండలంలోని చాప్లాతండాలో బానోత్ పాండునాయక్‌కు చెందిన మూడెకరాల బొప్పాయి తోటలో చెట్లు విరగడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. పలు గ్రామాల్లో గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. పలు కొనుగోలు కేంద్రాల్లో వర్షపు నీరు చేరడంతో ధాన్యం తడిసింది. పలు గ్రామాల్లో ఇంటి పైరేకులు కొట్టుకుపోయాయి. జిల్లా వ్యాప్తంగా 279పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు కిందపడిపోయాయి.

రోడ్లపై భారీ వృక్షాలు..

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధి ఈదులపూసపల్లి, గాంధీపురం, అనంతారంలో అకాల వర్షానికి పలు ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. ధాన్యం తడిసిపోయింది. మామిడికాయలు నేలరాలగా.. భారీ వృక్షాలు రోడ్లపై పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

గార్లలో రాలిన మామిడికాయలు..

గార్ల: అకాల వర్షంతో మండలంలోని పుల్లూరు, మద్దివంచ, గార్ల, బుద్దారం, సీతంపేట గ్రామాల్లో మామిడికాయలు నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలో సుమారు 25 ఎకరాల్లో మామిడితోటలు నష్టపోయినట్లు ఉద్యానవన శాఖ మండల అధికారి శాంతిప్రియ తెలిపారు.

కొట్టుకుపోయిన ధాన్యం

మహబూబాబాద్ రూరల్ : అకాల వర్షంతో మహబూబాబాద్ మండలం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. కంబాలపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. మామిడికాయలు నేలరాలిరైతులకు నష్టం వాటిల్లింది. విద్యుత్ స్తంభాలు విగిరిపడ్డాయి.



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని దగ్గరకు చేస్తున్న రైతులు



దోర్నకల్: చాప్లాతండాలో నేలమట్టమైన బొప్పాయి చెట్లు

రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి

- వీసీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మహబూబాబాద్: ఈనెల 5నుంచి 20 తేదీ వరకు జిల్లాలో ఒక మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్‌తో కలిసి భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులు, నీట్ నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. భూసేకరణ జరిగిన భూముల వివరాలు అప్‌డేట్ చేయాలన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఈనెల 4న జరిగే నీట్ ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీసీలో జిల్లా నుంచి కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీర బ్రహ్మచారి, సంబంధిత అధికారుల పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అధికారులు

వైద్యసేవలు అందించడంలో ముందుండాలి

గూడూరు: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ముందుండాలని డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్ అన్నారు. మండలంలోని తీగలవేణి, అయోధ్యపురం పీహెచ్‌సీలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్, ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తీగలవేణి పీహెచ్‌సీ వైద్యులు రాంబాబు, అయోధ్యపురం పీహెచ్‌సీ వైద్యులు యమున, జిల్లా మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, సిబ్బంది రమేష్, శానుబేగం, గణేశ్ పాల్గొన్నారు.

అవగాహన కలిగి ఉండాలి

నెహ్రూసెంటర్: సికిల్ సెల్ ఎనిమియా వ్యాధిపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్ అన్నారు. శుక్రవారం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధిపై అవగాహన కల్పించి వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేశారు. ఈ వ్యాధి ఉన్నవారు రక్తహీనతకు గురవుతారని, తగిన చికిత్స తీసుకోకపోతే తీవ్రమైన సమస్యలతో బాధపడుతారని తెలిపారు. వ్యాధిపై అవగాహన పెంచుకుని చికిత్స తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ శ్రవణ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ సుధాకర్, అనిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ హితేష్, డాక్టర్ జ్యోతిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్స్ కేవీ రాజు, పురుషోత్తం, సూపర్‌వైజర్ నాగబ్రహ్మచారి, ఉమాకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గూడూరు: తీగలవేణి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్

మేడారంలో పారిశుద్ధ్య పనులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని మేడారంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ములుగు జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు శుక్రవారం పరిశీలించారు. జంపన్నవాగు స్నానఘాట్టాలు, మేడారం ఐలాండ్, జంపన్నవాగు నుంచి గద్దెల వరకు, అలాగే సమ్మక్క-సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడారానికి బుధ, గురు, శుక్ర, ఆదివారాల్లో భక్తులు వేలాదిగా తరలివస్తున్నారని, వారు ఇబ్బంది పడకుండా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులు ఎక్కడపడితే అక్కడ విడిది చేసి చెత్తాచెదారాన్ని పడేయకుండా సహకరించాలన్నారు. రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నామన్నారు. జంపన్నవాగు వద్ద భక్తులు స్నానాలు ఆచరిస్తున్న క్రమంలో స్నానఘాట్టాలపై చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీఓ శ్రీధర్‌రావు, పంచాయతీ కార్యదర్శి కొర్నెబెల్లి సతీష్ తదితరులు ఉన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ దేవరాజు

సివిల్ సప్లయీస్‌కు ‘సీఎంఆర్’ చిక్కులు

- పెండింగ్‌లో గత రబీ, ఖరీఫ్ సీఎంఆర్ బియ్యం
- లక్ష్యానికి దూరంగా చాలామంది రైసుమిల్లర్లు
- గడువు పెంచినా కదలని సీఎంఆర్ బకాయి
- ఊపందుకున్న రబీ ధాన్యం కొనుగోళ్లు
- డిఫాల్టర్‌లకు సీఎంఆర్ ఇవ్వద్దని సర్కారు ఆదేశం..
- ‘ప్రత్యామ్నాయం’పై కసరత్తు



సాక్షిప్రతినిధి, వరంగల్:

- హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని ఓ రైసుమిల్లుకు 2021–22, 2022–23 సంవత్సరాలకు కేటాయించిన సీఎంఆర్ కింద 4,310 మె.టన్నుల బియ్యానికి 1,889 మె.టన్నులు మాత్రమే సరఫరా చేశారు. సుమారు రూ.7.50 కోట్ల విలువైన బియ్యం ఎగవేయడంతో అప్పట్లో సివిల్ సప్లయీస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి బియ్యం లేకపోవడంతో కేసులు నమోదు చేసి డిఫాల్టర్ లిస్టులో చేర్చారు.
- మహబూబాబాద్ జిల్లాలోని మూడు మిల్లుల్లో గత సీజన్‌లో రూ.30.38 కోట్ల విలువైన 1,13,796 క్వింటాళ్ల ధాన్యం దారి మళ్లించినట్లు తేలింది. అదే విధంగా కేసముద్రం విలేజ్ గ్రామంలోని రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయ్, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.30 కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించి కేసులు పెట్టారు.

ఉమ్మడి జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. రైతులనుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద రైసుమిల్లర్లకు సరఫరా చేయాల్సి ఉండగా.. ఈసారి డిఫాల్టర్‌లకు ఇవ్వొద్దని ప్రభుత్వంనుంచి కచ్చితమైన ఆదేశాలు ఉన్నాయి. 20 శాతం మిల్లర్లు ఈ జాబితాలో ఉండే అవకాశం ఉంది. సివిల్ సప్లయీస్ అధికారులు వాటిపై పునరాలోచన చేస్తూ మిగతా మిల్లర్లకు ధాన్యం ఇస్తున్నారు.

ధాన్యం దిగుబడుల అంచనాలకు అనుగుణంగా ఉమ్మడి వరంగల్‌లో 987 కొనుగోలు కేంద్రాలను పౌరసరఫరాల శాఖ ప్రతిపాదించింది. ఈ మేరకు జిల్లాల వారీగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. జేఎస్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో పాక్షికంగా సాగుతుండగా.. మిగతా జిల్లాల్లో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ధాన్యం అమ్ముకుంటున్న రైతులకు ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మెనేజ్‌మెంట్ సిస్టం (ఓపీఎంఎస్) ద్వారా డబ్బు బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తున్నారు.

దాడులు, కేసులు పెట్టినా అదే మొండివైఖరి...

సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యాన్ని పలు జిల్లాల్లో కొందరు రైస్ మిల్లర్లు పక్కదారి పట్టించారు. రాష్ట్ర వ్యాప్తంగా పౌరసరఫరాలశాఖ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మూకుమ్మడి తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. గత రబీ సీజన్‌లో సీఎంఆర్ కోసం కూడా హనుమకొండ, వరంగల్, జేఎస్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లోనూ ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లాలోని మూడు మిల్లుల్లో రూ.30.38 కోట్ల విలువైన 1,13,796 క్వింటాళ్ల ధాన్యం దారి మళ్లించినట్లు తేలింది. వరంగల్ జిల్లాలోని ఓ మిల్లులో రూ.3.79 కోట్ల విలువైన 12,360 క్వింటాళ్లు పక్కదారి పట్టినట్లు గుర్తించి కేసు పెట్టారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్‌లో జరిపిన తనిఖీల్లో ఆరేడు సంవత్సరాలకు సంబంధించిన రూ.201 కోట్లకు పైగా విలువైన బియ్యం బకాయి ఉన్నట్లు వెల్లడించారు. కాగా ఇప్పటికే డిఫాల్టర్ జాబితాలో ఉన్న పలువురికి నోటీసులు జారీ చేశామని, 6ఏ కేసులు కూడా నమోదు చేశామని, అవసరమైతే రెవెన్యూ రికవరీ యాక్టు కూడా పెడతామని పౌరసరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు.

రబీ సీజన్ ఆచితూచి..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బాయిల్డ్, రా రాస్ మిల్లులు 328 వరకు ఉన్నాయి. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, జనగామ, భూపాలపల్లి జిల్లాలోని మిల్లుల నుంచి బకాయిలు సుమారు లక్షా 20వేల మెట్రిక్ టన్నుల పైచిలుకు రావాల్సి ఉందని ఫైనల్‌గా తేల్చారు. సీఎంఆర్ బకాయి ఉన్న డిఫాల్టర్‌లకు ఈ సీజన్‌లో ధాన్యం ఇవ్వరాదన్న ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ సీజన్ 10.24 లక్షల మె.టన్నుల మేరకు ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేసిన అధికారులు 987 కొనుగోలు కేంద్రాల కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఇన్‌టైమ్‌లో సీఎంఆర్ ఇచ్చిన మిల్లర్లకే సరఫరా చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. డిఫాల్టర్‌గా ఉన్న రైసుమిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని సకాలంలో సీఎంఆర్ ఇచ్చిన మిలర్లకు తరలించడమా... లేక ఈ సీఎంఆర్ బకాయి రాబట్టుకుని అదనంగా జమానత్‌లు తీసుకుని వారికే ఇవ్వడమా... అన్న కోణంలో కసరత్తు చేస్తున్నారు.

పోలీస్ కుటుంబాలకు భద్రత చెక్కుల అందజేత

వరంగల్ క్రైం : కమిషనరేట్ పరిధిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ పలు కారణాలతో గత ఏడాది మరణించిన కానిస్టేబుళ్ల కుటుంబాలకు భద్రత విభాగం మంజూరు చేసిన చెక్కులను శుక్రవారం వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ అందజేశారు. కానిస్టేబుల్ నర్సింహస్వామి కుటుంబానికి రూ.7,36,830, మరో కానిస్టేబుల్ కిరణ్ కుమార్ కుటుంబానికి రూ.5.87 లక్షల విలువైన చెక్కులను సీపీ అందజేశారు. వారి కుటుంబ స్థితిగతులను సీపీ ఆరా తీశారు. అదనపు డీసీపీ రవి, ఏఓ రామకృష్ణస్వామి, సూపరింటెండెంట్ రమాదేవి పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంపు ఏర్పాటు

గార్ల: యువతీ, యువకుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు గార్లలో బాస్కెట్‌బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి జ్యోతి తెలిపారు. ఈమేరకు శుక్రవారం గార్లలోని బాలుర ఉన్నత పాఠశాలలో సమ్మర్ కోచింగ్ క్యాంపును ఆమె లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై రియాజ్‌పాషా, విశ్రాంత పీడీ రామన్న, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శీలంశెట్టి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి అజ్మీరా కిషన్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్, గుండా వెంకట్‌రెడ్డి, సీపీఎం జిల్లా, మండల నాయకులు కందునూరి శ్రీనివాస్, అలువాల సత్యవతి, కొణతం సత్యనారాయణరెడ్డి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ సూత్రపు జయశంకర్, రాము, శ్రీను, చంద్రశేఖర్, ఉమేశ్, అలువాల పవన్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



క్యాంపును ప్రారంభిస్తున్న జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి జ్యోతి

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల మూల్యాంకనం

విద్యారణ్యపురి : తెలంగాణ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం హనుమకొండలోని తొటబడిలో నిర్వహించనున్నారు. రాష్ట్రంలో పలు మూల్యాంకనం కేంద్రాలుగా ఉండగా అందులో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని హనుమకొండలో తొటబడిని ఎంపిక చేశారు. ఈనెల 5నుంచి 7వతేదీ వరకు టెన్త్ పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం, 8నుంచి 10వతేదీవరకు ఇంటర్మీడియట్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం జరుగుతుందని ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ అనగోని సదానందం శుక్రవారం తెలిపారు. ఈ కేంద్రానికి టెన్త్ పరీక్ష జవాబు పత్రాలు 9,379 ఉండగా, ఇంటర్మీడియట్ పరీక్షల జవాబుపత్రాలు 16,286 కేటాయించారు. టీఎస్ ఎగ్జామినర్లుగా 13మంది, ఏతులుగా 77మంది ఉపాధ్యాయులను, స్పెషల్ అసిస్టెంట్లుగా 13 మందిని నియమించామని సదానందం చెప్పారు.

భగవత్ భక్తే ప్రధాన మార్గం

హనుమకొండ కల్చరల్: పరమాత్మడి సృష్టి మోక్షాన్ని పొందడానికి భగవత్ భక్తే ప్రధాన మార్గమని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ అన్నారు. శుక్రవారం జగద్గురు ఆదిశంకరులు, శ్రీమద్ రామానుజాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. వేయిస్తంభాల ఆలయ ఆవరణలోని 'కుడా' గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వేదికపై ఆదిశంకరులు, రామానుజాచార్యుల చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి, ధన్వంతరి సేవా సమితి ఆధ్వర్యంలో గంగు ఉపేంద్రశర్మ అధ్యక్షతన 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ 'కుడా' గార్డెన్స్‌లో భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్డు నిర్మిస్తామని అన్నారు.

అన్‌యూజ్డ్ పోస్టులపై తిరకాసు

వర్క్‌మెన్ పోస్టులు ఉన్నతీకరించడంతో వ్యతిరేకత

- కార్మిక శాఖకు ఫిర్యాదు.. 9న జాయింట్ మీటింగ్
- సబ్ స్టేషన్లలో ఆపరేటర్ల కరువు
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

హన్మకొండ : అన్‌యూజ్డ్ పోస్టులను ఉన్నతీకరించడంపై కార్మిక శాఖ విచారణ చేపట్టడంతో ఈ వివాదం ఎటువైపు తిరుగుతుందోనని విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో విస్తృత చర్చ సాగుతోంది. వర్క్‌మెన్ క్యాడర్ పోస్టులను ఉన్నతాధికారుల పోస్టులుగా ఉన్నతీకరించడం వివాదస్పదంగా తయారైంది. విద్యుత్ ఉద్యోగులతో పాటు, కొన్ని విద్యుత్ ఉద్యోగ సంఘాలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. అన్‌యూజ్డ్ పోస్టులను ఉన్నతీకరించడంపై తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ కార్మిక శాఖకు ఫిర్యాదు చేసింది. అన్‌యూజ్డ్‌గా ఉన్న వర్క్‌మెన్ పోస్టులను రెగ్యులర్ పోస్టులుగా క్షేత్ర స్థాయిలో భర్తీ చేసి భారం తగ్గించాలని ఉద్యోగ సంఘాలు కోరితే ఇందులో కొన్నింటిని వర్క్‌మెన్‌గా, మరికొన్నింటిని పీ అండ్ జీ, ఇంజనీర్స్, అకౌంట్స్ విభాగం అధికారులకు పదోన్నతులకు అనుగుణంగా ఉన్నత స్థాయి పోస్టులను సృష్టిస్తూ నిర్ణయం తీసుకున్నారని విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గన్‌మ్యాన్, టెలిఫోన్ బాయ్, కార్పెంటర్, సివిల్ మేస్త్రీ, స్టోర్ కీపర్, టెలిఫోన్ ఇన్‌స్పెక్టర్, టెలిఫోన్ ఆపరేటర్, టూల్ కీపర్ వంటి 215 పోస్టులు వృథాగా ఉంటున్నాయి. ఈ పోస్టులను భర్తీ చేయకుండా ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల పోస్టులపై భారం పడుతోంది.



కొన్నేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న 215 అన్‌యూజ్డ్ పోస్టులతో పాటు, ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల 200 పోస్టులు.. మొత్తం 415 పోస్టుల స్థానంలో చీఫ్ ఇంజనీర్, సీజీఎం (అకౌంట్స్), జాయింట్ సెక్రటరీ (పీ అండ్ జీ), జనరల్ మేనేజర్ (పీ అండ్ జీ), అకౌంట్స్ ఆఫీసర్ ఒక్కో పోస్టు చొప్పున, ఎస్ఈ, డీఈ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, వాచ్‌మెన్ పోస్టులు నాలుగు చొప్పున, రెండు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, ఆరు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, సబ్ ఇంజనీర్ పోస్టులు 16 చొప్పున, 20 జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, 88 సీనియర్ అసిస్టెంట్, 32 సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్, 48 అసిస్టెంట్ లైన్‌మెన్, 88 ఆఫీస్ సబార్డినేట్, ఆరు స్వీపర్ పోస్టులుగా మార్చినట్లు సమాచారం. 415 పోస్టుల స్థానంలో కొత్తగా 339 పోస్టులుగా స్థిరీకరించారు.

ఈ సేవల్లోంలో చీఫ్ ఇంజనీర్, సీజీఎం (అకౌంట్స్), జాయింట్ సెక్రటరీ (పీ అండ్ జీ), జనరల్ మేనేజర్ (పీ అండ్ జీ), అకౌంట్స్ ఆఫీసర్ ఒక్కో పోస్టు చొప్పున, ఎస్ఈ, డీఈ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, వాచ్‌మెన్ పోస్టులు నాలుగు చొప్పున, రెండు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, ఆరు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, సబ్ ఇంజనీర్ పోస్టులు 16 చొప్పున కొత్తగా పోస్టులు సృష్టించడంతో క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న వర్క్‌మెన్ క్యాడర్ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. దీంతో యూనియన్ నాయకులు మూడు నెలల క్రితం కార్మిక శాఖకు ఫిర్యాదు చేయగా దీనిపై విచారణ ఇప్పటికి రెండు సార్లు కొనసాగింది. దీంతో ఈ నెల 9న జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసినట్లు కార్మిక శాఖ వరంగల్ జోన్ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం.రాజేంద్ర ప్రసాద్ టీజీ ఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. అన్‌యూజ్డ్ పోస్టుల వ్యవహారం ఏటు వైపు తిరుగుతుందో అని విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఉద్యోగులపై అదనపు భారం

టీజీ ఎన్పీడీసీఎల్‌లో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు 932 ఖాళీగా ఉండగా 25 నెలల క్రితం 100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి ఇటీవల 93 పోస్టులు భర్తీ చేశారు. కోర్టులో కేసు కారణంగా మిగతా పోస్టులు భర్తీ చేయలేదు. మిగిలిన 839 పోస్టుల్లో 200 పోస్టులకు కోత పెట్టి ఉన్నత స్థాయి పోస్టులుగా సృష్టించి ప్రభుత్వ ఆమోదానికి పంపినట్లు సమాచారం. కొత్త సబ్ స్టేషన్లు నిర్మించినా ఆ మేరకు ఆపరేటర్ల నియామకం చేపట్టకపోవడంతో అందుబాటులో ఉన్న ఆపరేటర్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులపై భారం పడుతోందని, కొన్ని సబ్‌స్టేషన్లలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తూ నిర్వహణను నెట్టుకొస్తున్నారు.

అమ్మానాన్నే నాకు ప్రేరణ..

కుటుంబ సహకారంతోనే విజయం



- దారా మేఘన

'మా కుటుంబం న్యాయవిద్యతో ముడిపడినందుకు నాకు ఎంతో గర్వంగా ఉంది. చిన్ననాటి నుంచి న్యాయశాస్త్రాన్ని చూసి పెరిగిన నేను, ఇప్పుడు అదే కుటుంబ వరంపరలో భాగంగా న్యాయం కోసం పనిచేయడం ఎంతో సంతృప్తిగా ఉంది. ఇది నాకు బాధ్యతను గుర్తు చేస్తోంది, ఈ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్న కర్తవ్యం కలిగిస్తోంది.' అని అంటున్నారు జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన దారా మేఘన. ఇటీవల వెలువడిన న్యాయశాస్త్ర ఫలితాల్లో వరంగల్ ధర్మ కాజీపేటకు చెందిన మేఘన జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీనుంచి 2023 న్యాయశాస్త్రం పట్టా పొంది న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. మొదటి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె ప్రయాణంపై 'సాక్షి' పలకరించగా పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.. -వరంగల్ లీగల్

- మా నాన్న నల్సార్ విశ్వవిద్యాలయంలో లా ప్రొఫెసర్..
- తరచూ అక్కడి వాతావరణాన్ని చూపించేవారు..
- 'సాక్షి'తో దారా మేఘన
- ఇటీవల న్యాయశాస్త్ర ఫలితాల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక

ప్రశ్న: ఎల్ఎల్‌బీని ఎందుకు ఎంచుకున్నారు?

జవాబు : నేను న్యాయశాస్త్రాన్ని ఎంచుకోవడానికి కారణం మా నాన్నగారు. తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడే న్యాయవిద్యను నా వృత్తిగా చేసుకోవాలని నిర్ణయించుకున్నా. జీవితమంతా ఆయన నాకు మోటివేషన్‌గా నిలిచారు. మా నాన్న నల్సార్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచే నాకు లా స్కూల్ వాతావరణాన్ని, విద్యార్థులను చూడగల అవకాశం కలిగింది. ఇదంతా న్యాయశాస్త్రం పట్ల నాలో ఆసక్తిని, అభిమానం పెంచింది.

ప్ర : మీకు ప్రేరణ ఎవరు.

జ : మా తల్లిదండ్రులే నాకు ప్రేరణ. మా నాన్న న్యాయశాస్త్ర ప్రొఫెసర్, అమ్మ ఎల్ఐసీలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్‌గా ఉన్నారు. వారి శ్రద్ధ, క్రమశిక్షణ నన్ను జీవితాన్ని సరిగ్గా ముందుకు నడిపించడంలో కలిసి వచ్చింది. ఏ రంగాన్ని ఎంచుకున్నా, దానికి ప్రోత్సాహం, స్వేచ్ఛను ఇచ్చారు. ఇక మా తమ్ముడు వంశీకృష్ణ ఎప్పుడూ నాకు మద్దతుగా నిలిచి, విద్యార్థినిగా ఎదుర్కొన్న కష్టాల్లో తోడుగా ఉన్నాడు. అలాగే, ప్రముఖ సీనియర్ అడ్వొకేట్ సి.విద్యాసాగర్ రెడ్డితో పనిచేసే అవకాశం నాకు లభించింది. ఆయన నుంచి న్యాయశాస్త్రం ప్రాయోగిక అంశాల్లో మార్గదర్శనం పొందాను. ఈ రంగాన్ని ఎంపిక చేసుకోవాలని ఆయన అప్పట్లో ఇచ్చిన సలహా నా జీవితంపై గణనీయమైన ప్రభావాన్ని చూపింది. ఇంకా, మా కళాశాల నుంచి పెద్దగా విజయాలు సాధించిన మా సీనియర్లు తరణి వేముగంటి, నేహా అగర్వాల్ విజయాలను దగ్గరగా చూసే అవకాశం లభించింది. తరణి ప్రస్తుతం సిద్దిపేటలో జూనియర్ సివిల్ జడ్జిగా, అదనప్పు జేఎంఎఫ్‌సీగా పనిచేస్తున్నారు. నేహా అగర్వాల్ డీఎస్పీ పదవిని పొందారు. వారి మాటలు నాకు దిక్సూచి చూపాయి.

ప్ర : ఎందుకు న్యాయవాద వృత్తిని ఎంచుకున్నారు.

జ : న్యాయశాస్త్రం ద్వారా న్యాయం సాధించడమే కాక సమాజానికి సేవ చేయవచ్చని నమ్మి ఈ మార్గాన్ని ఎంచుకున్నాను

ప్ర : మీరు ఎదుర్కొన్న సవాళ్లు.

జ : నా ప్రయాణంలో ఒత్తిడి, ఆందోళన ఎదుర్కోవాల్సి వచ్చింది. సమయం కూడా చాలా పరిమితంగా ఉండేది. ఆ సమయంలోనే అన్ని విభాగాలను కవర్ చేయాలన్న ఒత్తిడితో ఉన్నా. ఇదే సమయంలో, మా తమ్ముడు ఆమె రికాం మాస్టర్స్ కోసం వెళ్లిపోవడం కూడా నాకు భావోద్వేగపూరితంగా కష్టంగా అనిపించింది. అయితే, నా స్నేహితులు, కుటుంబ సభ్యులు అందరూ నిలిచి నా అర్థంకులను అధిగమించడంలో సహాయం చేశారు.

ప్ర : మీ నెక్స్ట్ గోల్?

జ : ఇప్పటినుంచి నా లక్ష్యం అత్యంత నిజాయితీగా, సమగ్రతతో సేవ చేయడం. న్యాయం వేగంగా అందించడంతో, అలస్యం లేకుండా ప్రజలకు న్యాయం చేసేందుకు కట్టుబడి పని చేయాలనుకుంటున్నాను. నాకు అండగా నిలిచిన తల్లిదండ్రులు, తమ్ముడికి, స్నేహితులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా. ఈ విజయాన్ని నాతో కలిసి పంచుకున్న బంధువులకు కూడా ధన్యవాదాలు.



'జంపన్న'కు జలకళ

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారంలోని జంపన్న వాగు నీటితో కళకళలాడుతోంది. గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో జంపన్న వాగులోకి వరద చేరింది. మొన్నటి వరకు చుక్కనీరు లేక ఎడిపోయి..ఇసుక దిబ్బలను తలపించింది. ఎగువ ప్రాంతంలో ఒక్కసారిగా వర్షం పడటంతో జంపన్నవాగులోకి వరద చేరి జలకళ సంతరించుకుంది. శుక్రవారం అమ్మవార్లను దర్శించుకునేందుకు మేడారానికి వచ్చిన భక్తులు జంపన్నవాగు నీటిలో పుణ్యస్నానాలు ఆచరించి పులకించిపోయారు. జంపన్న వాగులోకి వరద ప్రవాహిస్తుండడంతో భక్తులు స్నానాలు ఆచరించే క్రమంలో ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా జంపన్నవాగులో ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయాలని పూజారులు కోరుతున్నారు.

బక్కమ్మ@105



- బక్కమ్మ



బక్కమ్మ జన్మదిన వేడుకల్లో కుటుంబ సభ్యులు

ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలి 105వ జన్మదిన సంబరాన్ని కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్వాతంత్య్ర సమరయోధురాలైన రీపాల బక్కమ్మ 104 సంవత్సరాల వయస్సును పూర్తి చేసుకుని 105వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కుటుంబ సభ్యులంతా ఒక్కతాటిపైకి చేరుకుని శుక్రవారం గ్రామంలో ఆనందోత్సవాల నడుమ జన్మదినాన్ని నిర్వహించారు. బక్కమ్మకు ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. వీరి తరపు కుటుంబసభ్యులు (121) మంది బుధరావుపేటలో శుక్రవారం కలుసుకుని జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ఐస్‌క్రీమ్ పార్లర్‌పై దాడులు



దాడిలో పాల్గొన్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కాజీపేట : కాజీపేట పట్టణంలో పర్వతలాల్ ఐస్‌క్రీమ్ తయారీ, డిస్ట్రిబ్యూటర్ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు ఐస్‌క్రీమ్ పార్లర్‌పై దాడులు చేసి రూ.29,050 విలువ చేసే ఐస్‌క్రీమ్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాణ్యత పాటించకుండా ఐస్‌క్రీమ్‌ల తయారీ, గడువు తీరిన ఐస్‌క్రీమ్‌లను, పాడైన ఐస్‌క్రీమ్‌లను పట్టుకున్నారు. దుకాణం యజమాని సూబాల్ అమర్‌లాల్‌పై తదుపరి చర్యల నిమిత్తం ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు.



దేవాదుల.. పరిష్కారమెలా?

నేడు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్ష

- మూడో దశలో భూసేకరణే అసలు సమస్య..
- దేవన్నపేట పంపుహౌస్, ధర్మసాగర్ సందర్శన

సాక్షి ప్రతినిధి, వరంగల్ : జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం 91 శాతం పూర్తయినా.. మూడో దశలో భూసేకరణ పనులు ముందుకు సాగక అసంపూర్తిగా మిగిలుతోంది. ఏడాదిలో 300 రోజులు 60 టీఎంసీల నీటిని వినియోగించుకుని తొమ్మిది జిల్లాల్లో 5.57 లక్షల ఎకరాలకు నీరందించే ఈ పథకానికి పూర్తి స్థాయిలో మోక్షం కలగడం లేదు. గతేడాది ఆగస్టు 31న కన్నాయిగూడెం బ్యారేజీ వద్ద మంత్రులు, కలెక్టర్లు, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. ఆర్థిక ఇబ్బందులున్నా అధిగమించి 2026 మార్చిలోగా ఈ పథకాన్ని పూర్తి చేస్తామని ప్రకటించారు. హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు జిల్లాలతో పాటు కరీంనగర్, సిద్దిపేట, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లోని 37 మండలాల్లో 5,56,722 ఎకరాలకు నీరందించడం ఈ పథకం లక్ష్యం.

భూసేకరణే ప్రధాన సమస్య..

ఇప్పటి వరకు 3,16,634 ఎకరాల ఆయకట్టు సాగులోకి రాగా, మరో 2,40,088 ఎకరాల ఆయకట్టుకు నీరందాల్సి ఉంది. అయితే మూడో దశలో నిలిచిపోయిన భూసేకరణ కారణంగా ఈ ప్రాజెక్టు 20 ఏళ్లయినా అసంపూర్తిగానే ఉంటుంది. రైతులు ఎక్కువ పరిహారాన్ని డిమాండ్ చేయడం, కోర్టు కేసులు వంటివి భూసేకరణకు అవరోధంగా మారాయి.

పెరుగుతున్న ప్రాజెక్టు అంచనా వ్యయం..

యాసంగి పంటలను కాపాడేందుకు ధర్మసాగర్ రిజర్వాయర్ ద్వారా స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాలకు నీరందించే సందర్భంలో పలుమార్లు మోటార్లు మొరాయించాయి. ఇదిలా ఉండగా 2004లో రూ.6,016 కోట్లున్న అంచనా వ్యయం, 2020 జూన్ నాటికి రూ.14,729.98 కోట్లకు పెరిగింది. 2023లో రూ.17,500 కోట్లు చేరుతుందని అంచనా వేశారు. ఫలితంగా ప్రాజెక్టు అంచనా వ్యయం కూడా విపరీతంగా పెరుగుతోంది. కాగా ప్రాజెక్టు పూర్తి భూసేకరణ అసలు సమస్యగా మారగా, 33,224 ఎకరాలకు 30,268 ఎకరాలు పూర్తి చేశారు. జనగామలో 945 ఎకరాలు, పాలకుర్తిలో 826, గజ్వేల్‌లో 230, నర్సంపేటలో 131, వర్ధన్నపేటలో 16 8 ఎకరాలు.. ఇలా మొత్తంగా 2,957 ఎకరాల సేకరణపై దృష్టిపెట్టి ఈ ప్రాజెక్టు పూర్తికి మార్గం సుగమం కానుంది.

నేడు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రివ్యూ..

రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి శనివారం దేవాదుల ప్రాజెక్టుపై కీలక సమీక్ష నిర్వహించేందుకు వరంగల్‌కు వస్తున్నారు. మధ్యాహ్నం 1:45 గంటల నుంచి 2:15 గంటల వరకు దేవన్నపేట పంప్ హౌజ్‌పై రివ్యూ చేయనున్నారు. అనంతరం 2:30 నుంచి 2.45 గంటల వరకు ధర్మసాగర్ రిజర్వాయర్ సిస్టర్న్, డెలివరీ టన్నెల్ పనులపై, 3గంటల నుంచి 3:30 గంటల వరకు వరద నియంత్రణ, భద్రకాళి చెరువు పూడిక తీత పనులపై సమీక్ష చేయనున్నారు. అలాగే 3:30 గంటల నుంచి 5:30 గంటల వరకు ఫోర్ట్ రోడ్‌లో ఉన్న నీటి పారుదల శాఖ పనులు, పౌర సరఫరాల శాఖ సమస్యలపై ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారులతో హనుమకొండ కలెక్టరేట్‌లో రివ్యూ చేయనున్నారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా హనుమకొండ నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

దంపింగ్ యార్డులో మగశిశువు మృతదేహం



శిశువు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషన్

మడికొండ : మడికొండ-రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న దంపింగ్ యార్డులో నవజాత శిశువు మృతదేహం లభించినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ శుక్రవారం తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. దంపింగ్ యార్డులో పని చేస్తున్న సిబ్బందికి శిశువు మృతదేహం కనిపించగా మడికొండకు చెందిన బైరి లింగమూర్తికి సమాచారం ఇచ్చారు. లింగమూర్తి వెంటనే ఇన్‌స్పెక్టర్ కిషన్‌కు విషయం తెలియజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న కిషన్ మృతదేహాన్ని పరిశీలించి చనిపోయిన మగ శిశువుగా గుర్తించారు. లింగమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. పంచనామా నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. శిశువు మృతదేహం ఇక్కడకు ఎలా వచ్చిందో తెలియడం లేదని, నగరంలోని ఏదైనా ప్రైవేట్ ఆస్పత్రి నుంచి తీసుకొచ్చి పడేశారా లేక ఇతరులు ఎవరైనా పడేశారా అని పరిశీలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ వివరించారు.

వరి కోత మిషన్ కింద పడి రైతు..



ఇస్లావత్ రావుజ్య మృతదేహం

నర్సంపేట : వరి కోత మిషన్ (హార్వెస్టర్) కింద పడి రైతు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని మగ్దుంపురం గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మగ్దుంపురం గ్రామానికి చెందిన రైతు ఇస్లావత్ రావుజ్య (55) గ్రామ శివారులో వరి కోత మిషన్‌తో వరిపైరును కోయిస్తున్నాడు. కోత మిషన్ వెనకాల ఉన్న రావుజ్యను డ్రైవర్ గమనించకుండా రివర్స్ తీశాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రావుజ్య కింద పడడంతో వెనకాల టైర్ తలపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో రావుజ్య తల నుజ్జునుజ్జు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య జాంకి, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దుగ్గొండి పోలీసులు పేర్కొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో పది మందికి గాయాలు



పిచ్చి కుక్క దాడిలో గాయపడిన వ్యక్తి

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల కేంద్రంలోని అప్పాల వీధిలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఆ వీధిలో నడుచుకుంటూ వెళ్తున్న పది మందిపై దాడి చేసి గాయపరిచింది. వారిని స్థానిక వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స చేయించి ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. గ్రామస్తులు ఆ పిచ్చికుక్కను చంపేశారు.

చెరువులో ఈతకు వెళ్లి వ్యక్తి మృతి

- కంబాలపల్లిలో ఘటన



భాస్కర్ (ఫైల్)



అనాథలైన స్వరూప, రక్షిత, వర్షిత

మహబూబాబాద్ రూరల్ : ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లిలో పెద్దచెరువు వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపిక శుక్రవారం కేసు వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని భవానీనగర్ తండా కు చెందిన జాటోత్ భాస్కర్ (35) ముఠామేస్త్రీ గుర్రి సమీపంలో గల రెబిస్ షాపులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో భాస్కర్ తన తమ్ముడు రవి, మిత్రులు కోటి, నరేష్, రమేష్, వెంకటేష్, రాజుతో కలిసి గురువారం కంబాలపల్లి పెద్ద చెరువు వద్దకు వెళ్లారు. అందరితో పాటు భాస్కర్ కూడా ఈత కొట్టడానికి చెరువులోకి దిగాడు. ఈత కొడుతూ కొంత దూరం వెళ్లాక గమనించిన తోటి మిత్రులు అతడిని బయటకి రమ్మని పిలిచిన పట్టించుకోకుండా ఉన్నాడు. అంతలోనే భాస్కర్ నీటిలో మునిగి కనిపించకుండా పోగానే వెంటనే వారు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సహాయంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాలించారు. శుక్రవారం ఉదయం భాస్కర్ మృతదేహం నీటిపై తెలియాడుతూ కనిపించడంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు రవి ఫిర్యాదు మేరకు ట్రైనీ ఎస్సై పి.నరేష్, కానిస్టేబుల్ లింగారావు కేసు నమోదు చేశారు.

అనాథలైన ముగ్గురు కుమార్తెలు..

భాస్కర్ మృతితో అతడి ముగ్గురు కుమార్తెలు అనాథలుగా మారారు. మద్యానికి బానిసైన భాస్కర్ కుటుంబ తగాదాలతో 2022లో తన భార్య కల్పనను జిల్లా కేంద్రంలోని అడ్వకేట్స్ కాలనీ శివారులో మృతదేహం చూపించి ఉరేసి చంపేసి హత్య చేశాడు. అదే కేసులో భాస్కర్ జైలుకు వెళ్లగా అప్పటినుంచి కుమార్తెలు స్వరూప, రక్షిత, వర్షిత కొద్దిరోజులు అమ్మమ్మ ఇంటి వద్ద, నాయనమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నారు. రెండేళ్ల క్రితం తల్లి కల్పన, ప్రస్తుతం తండ్రి భాస్కర్ మృతితో ముగ్గురు కుమార్తెలు అనాథలుగా మారారు.

అదృశ్యమైన బాలుడు చెరువులో శవమై..

- అనుమానాస్పదంగా చిన్నారి మృతి
- లక్ష్మణ్‌తండాలో విషాద ఛాయలు



జానీపాల్ (ఫైల్)

గూడూరు : రెండ్రోజుల క్రితం తండ్రితో ఆటోలో వస్తూ కనిపించకుండా పోయిన బాలుడు శుక్రవారం చెరువులో శవమై తేలాడు. మండలంలోని చిన్న ఎల్లాపురం శివారు లక్ష్మణ్‌తండాకు చెందిన బాలుడు వాంకుడోత్ జానీపాల్ (6) తండ్రి కృష్ణమూర్తితో కలిసి ఆటోలో వస్తూ కనిపించకుండా పోయాడు. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి బాలుడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు గాలిస్తుండగా, సీతానగరం శివారు రాళ్ల చెరువులో శవమై కనిపించాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాలుడి శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాలుడి మృతి అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నీటి సంపులో పడి చిన్నారి..

- సాయినగర్‌లో విషాద ఘటన



ఆర్యన్ (ఫైల్)



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

ఎల్కతుర్తి : ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న ఓ చిన్నారి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందిన సంఘటన హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సాయినగర్ నూతన గ్రామ పంచాయతీలో శుక్రవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. (కొత్తపల్లి) సాయినగర్ గ్రామానికి చెందిన కూన రాకేశ్-రవళి దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాకేశ్ వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. తల్లి రవళి వంటపనిలో నిమగ్నమైంది. కుమారుడైన ఆర్యన్ (11 నెలల బాలుడు) ఇంటి ఆవరణలో ఆటలాడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడ్డాడు. బాలుడిని ఎవరూ గమనించకపోవడంతో ఆర్యన్ మృతిచెందాడు. ఇంటికొచ్చిన బాలుడి తండ్రి రాకేశ్ నీటి సంపు దగ్గరకు వెళ్లగా.. అందులో ఆర్యన్ మృతదేహం కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.